

తేజ కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్న ఎమ్మెల్యే బీరం

## బాధితుడికి ఎమ్మెల్యే బీరం భరోసా

- వైద్యానికి రూ.50వేల ఆర్థికసాయం అందజేత

కోడేరు, సెప్టెంబర్ 30 : చికిత్స చేయించుకునే ఆర్థిక స్థోమత లేక ఇబ్బంది పడుతున్న గిరిజనుడికి ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ఆర్థిక భరోసానిచ్చి అండగా నిలిచారు. కోడేరు మండలం నాగులపల్లితండాకు చెందిన రాత్లావత్ హనుమంతునాయక్ కుమారుడు తేజ తీవ్ర అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నాంపల్లి ఎంఎన్‌జే దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. కాగా వైద్యం చేయించుకునే స్థోమత లేకపోవడంతో ఈ విషయాన్ని తండాకు చెందిన బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే బీరం రూ.50వేలు బాధితుడి కుటుంబానికి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ అవసరం వచ్చినా వెంటనే స్పందిస్తానన్నారు. సకాలంలో ఆదుకున్న ఎమ్మెల్యేకు తాము ఎప్పటికీ రుణపడి ఉంటామని తేజ కుటుంబీకులు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బాలునాయక్, మీటునాయక్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలకు కరెంట్ సామగ్రి వితరణ



కావేటి శ్రీనివాసులుకు సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం

లింగాల, సెప్టెంబర్ 30 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు దాతలు కరెంట్ సామగ్రి, క్రాఫ్ట్ మెటీరియల్‌ను శనివారం వితరణ చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం శేఖర్ మాట్లాడుతూ తరగతిగదుల్లో చీకటి ఉండడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతుండేవారన్నారు. ఈ విషయాన్ని గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి కావేటి శ్రీనివాసులు, కావేటి పద్మమ్మ దృష్టికి తీసుకెళ్లగా వారు స్పందించి రూ.50వేలు విలువ చేసే కరెంట్ సామగ్రి, రూ.10వేలు విలువ చేసే క్రాఫ్ట్ మెటీరియల్‌ను కొనుగోలు చేసి అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా దాత శ్రీనివాసులుకు స్కూల్ సిబ్బంది కృతజ్ఞతలు తెలిపి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసులు, వెంకట్‌రాజు, చంప్లి, అరవింద్, అహ్మద్, రేష్మా, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి పాండు పాల్గొన్నారు.

## గర్భిణులకు పోషకాహారం పంపిణీ



గర్భిణులకు పోషకాహార ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న అధికారులు

ఉప్పునుంతల, సెప్టెంబర్ 30 : మండలంలోని మర్రిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం గర్భిణులకు పాలు, గుడ్లు, నూనె, మురుకులు ఇతర సమతుల పోషకాహార ప్యాకెట్లను అధికారులు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ టీచర్లు సమ్మెలో ఉండడంతో ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి పంపిణీ చేస్తున్నది. కార్యక్రమంలో ఎంపీవో నారాయణ, సూపర్‌వైజర్ బిపాషా తదితరులు పాల్గొన్నారు.

## జోరుగా మైసమ్మ ఆలయ నిర్మాణ పనులు

పెద్దకొత్తపల్లి, సెప్టెంబర్ 30 : మండలంలోని నాయినోనిపల్లి మైసమ్మ ఆలయ నిర్మాణానికి దేవాదాయ శాఖ రూ.2.35కోట్లు మంజూరు చేయడంతో పనులు జోరుగా సాగుతున్నాయి. భక్తుల కోరికలు తీర్చే దేవతను ప్రతి ఆదివారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేలాదిమంది భక్తులు సందర్శించుకొని మొక్కులు తీర్చుకుంటారు. ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయించారు. ఇటీవల ఆలయ పాలక మండలి సభ్యులు ప్రమాణ స్వీకారం చేయగా, వచ్చేనెలలో గుడిని ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. నూతన గుడి ఏర్పాటుతో ఉమ్మడి జిల్లాలోనే ఎంతో ప్రసిద్ధి చెందిన మైసమ్మ ఆలయంగా పేరుగాంచనున్నది. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలయాల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నాడనడానికి ఇదొక ఉదాహరణ.

# బీమాతో ధీమా

- ఇప్పటి వరకు 227మంది రైతు కుటుంబాలకు లబ్ధి
- నామినీల ఖాతాల్లో రూ.11.35కోట్లు జమ

లింగాల, సెప్టెంబర్ 30: తెలంగాణ ప్రభుత్వం రైతుల కోసం రైతు బీమా పథకాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టింది. ఏ కారణంతోనైనా రైతు చనిపోతే ఆ కుటుంబం రోడ్డున పడకుండా ఆర్థికంగా ఆదుకునేందుకు ఈ పథకానికి శ్రీకారం చుట్టింది. దళారుల ప్రమేయం లేకుండా నేరుగా నామినీ ఖాతాలో రూ.5 లక్షల బీమా డబ్బులు జమ చేస్తున్నది. ప్రమాదవశాత్తు రైతు చనిపోతే 10రోజుల్లో బీమా పరిహారం అందించడమే ఈ పథకం లక్ష్యం. ప్రభుత్వం రైతు పేరు మీద రూ.2,271 ప్రీమియం చెల్లిస్తున్నది. 2018 ఆగస్టు 14న ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ పథకానికి రూపకల్పన చేశారు. 18 ఏండ్లు పైబడిన వారి నుంచి 59 ఏండ్ల లోపు వారికి ఒక గుంట భూమి పట్టా ఉండి.. ఏ కారణం చేతనైనా సదరు రైతు చనిపోతే వారికి ఈ పథకం వర్తిస్తుంది. కుటుంబంలో పెద్ద దిక్కును కోల్పోతే ఆ కుటుంబం వీధిన పడకుండా ముఖ్యమంత్రి కేసీఆర్ ముందుచూపుతో రైతుబీమా పథకాన్ని ప్రవేశ పెట్టారు.ఈ పథకంతో మండలంలోని ఆయా గ్రామాల్లో దాదాపు 227 మంది రైతు కుటుంబాలకు లబ్ధి చేకూరింది. 2018–19లో 22 మంది, 2019–20లో 41మంది, 2020–21లో 63మంది, 2021 –22లో 50మంది, 2022–23లో 51మంది రైతులు చనిపోతే బినామీకి తావు లేకుండా నేరుగా నామినీల ఖాతాల్లో రూ.5లక్షల చొప్పున రూ.11. 35కోట్లు జమ చేసినట్లు మండల వ్యవసాయధికారి నాగార్జునరెడ్డి తెలిపారు.



పత్తి పొలంలో గుంటుక కొడుతున్న రైతు

### కేసీఆర్ సార్ మేనమామ అయిండు



నా భర్త అనారోగ్యంతో చనిపోయిండు. నాకు పెళ్లి వయస్సుకొచ్చిన బిడ్డ ఉన్నది. పెండ్లి ఎలా చేయాలోననే భయంతో నాకు నిద్ర పట్టేది కాదు. నా భర్త చనిపోయిన 20రోజుల్లో నాకు రైతుబీమా డబ్బులు వచ్చాయి. వాటితో నా బిడ్డ పెండ్లి చేసిన. భర్త చనిపోయిన బాధలో ఉన్న నాకు పెళ్లి చేయమని కేసీఆర్ సార్ మేనమామగా వచ్చి దీవించిండు. కేసీఆర్ సార్‌కు మా కుటుంబం రుణపడి ఉంటది.

-సుగుణమ్మ, అప్పాయిపల్లి

### బీమా సొమ్ముతో ఇల్లు కట్టుకున్నా



మాది సాధారణ కుటుంబం. పని చేసుకుంటే గానీ పూట గడవని పరిస్థితి. మా ఆయన బన్నే ఈదమయ్య పొలంలో పశువులు మేపుతుండగా ప్రమాదవశాత్తు పిడుగుపడి 2019లో చనిపోయారు. మేము గుడిసెలో ఉండేటోళ్లం. నా భర్త చనిపోయాక కేసీఆర్ సార్ బీమా పైసలు ఇచ్చారు. వచ్చిన సొమ్మును వృథా చేయకుండా ఇల్లు కట్టుకున్నా. కేసీఆర్ సార్ సల్లంగుండాలే.

-బన్నే లక్ష్మమ్మ, అప్పాయిపల్లి, లింగాల

### ట్రాక్టర్ కొని సేద్యం చేస్తున్నాం..



పోయిన ఏడాది నా భర్త అనారోగ్యంతో చనిపోయాడు. కేసీఆర్ సార్ రైతుబీమా డబ్బులు ఇచ్చిండు. నాకు నలుగురు కుమారులు. మాకు ఉన్న భూమిని దున్నుకొవడానికి ట్రాక్టర్ కొన్నా. దీంతో మాకున్న భూమిని దున్నుకుంటూ ఖాళీ సమయంలో వేరే వాళ్ల భూమిని దున్నడానికి వెళ్తున్నాం. సీఎం కేసీఆర్ సార్ మా ఇంటికి పెద్దదిక్కయ్యారు. ఎప్పటికీ ఆయన వెంటే ఉంటాం.

-లక్ష్మీదేవమ్మ, అప్పాయిపల్లి, లింగాల

## మత్స్యకారులకు చేయూత



భూర్గమాను తెట్టకుంట చెరువులో చేపపిల్లలను వదులుతున్న కౌన్సిలర్ బరిగెలరాముడుయాదవ్

కొల్లాపూర్, సెప్టెంబర్ 30 : ప్రభుత్వం మత్స్యకారులకు చేయూతనిస్తున్నదని కౌన్సిలర్ రాముడుయాదవ్ అన్నారు. శనివారం పట్టణ శివారులోని భూర్గమాను తెట్టకుంటలో ప్రభుత్వం సరఫరా చేసిన ఉచిత చేపపిల్లలను ఆయన విడుదల చేశారు. ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ఆదేశానుసారం చేపపిల్లలను వదిలినట్లు ఆయన తెలిపారు. పట్టణ శివారులోని చెరువుల్లో మూడులక్షల చేపపిల్లలను వదులుతామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మత్స్యపారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు సుధాకర్, ఉపాధ్యక్షుడు పిట్టల సుధాకర్, డైరెక్టర్లు, సంఘం నాయకులు, మత్స్యకారులు పాల్గొన్నారు.

## మోదీ పర్యటనతో ప్రయోజనం లేదు

అచ్చంపేట రూరల్, సెప్టెంబర్ 30 : 2014 లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా పాలమూరుకు వచ్చిన పీఎం మోదీ అప్పుడిచ్చిన హామీలను ఇప్పటికీ నెరవేర్చలేదని బీఆర్ఎస్ మండల సోషల్ మీడియా అధ్యక్షుడు అజయ్‌కుమార్ విమర్శించారు. పాలమూరు –రంగారెడ్డి ప్రాజెక్టుకు పూర్తిస్థాయిలో అనుమతులిచ్చి జాతీయ హోదా కల్పిస్తానని చెప్పి ఇంతవరకు నెరవేర్చకుండా మళ్లీ పాలమూరు ప్రజలను మోసం చేయడానికి వస్తున్నారని దుయ్యబట్టారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మోదీ పాలమూరుకు ఏం చేశారని మరోసారి ఇక్కడికి వస్తున్నారని, ఆయన పర్యటన వల్ల ఎవరికి ప్రయోజనం చేకురుతుందని ప్రశ్నించారు. పీఆర్ఎల్ఐ ప్రాజెక్టుకు పరిపాలనా అనుమతులిచ్చేందుకు గతంలో ఎన్నో ఇబ్బందులు పెట్టారని గుర్తు చేశారు. ప్రయోజనం లేని ప్రధాని పాలమూరు పర్యటనను తాము అడ్డుకొని తెలంగాణ ప్రజలను కాపాడుకుంటామని స్పష్టం చేశారు.

## రోగులకు పాలు, పండ్లు పంపిణీ

అమ్రాబాద్, సెప్టెంబర్ 30 : ఉద్యమ నాయకుడు, పదర బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎడమ తిరుపతయ్య వర్ధంతి సందర్భంగా శనివారం పదర ప్రభుత్వ దవాఖానలో రోగులకు పాలు, పండ్లు, జ్యూస్, బ్రెడ్ అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీకి ఆయన చేసిన సేవలను పలువురు గుర్తుచేసు కున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసులు, వైద్య సిబ్బంది, బీఆర్ఎస్ నాయకులు, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## నేడు మాదిగ దండోరా ఆత్మగౌరవ సభ

- హాజరుకానున్న విప్ గువ్వల, ఎంపీ రాములు,నేతలు

అచ్చంపేట, సెప్టెంబర్ 30 : పట్టణంలోని షామ్స్ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం ఉదయం 11గంటలకు నిర్వహించే మాదిగల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చింతల శ్యామ్ శనివారం ప్రకటనలో కోరారు. సభకు ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు, ఎంపీ రాములు, ఢిల్లీలో ప్రభుత్వ అధికార ప్రతినిధి మంద జగన్నాథం, బీజేపీ సతీష్, బీఎస్పీ మోత్కూరి నాగార్జున, టీడీపీ మోపతయ్య, ఇతర పార్టీల్లోని మాదిగ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొంటారని తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల ప్రజలు, నాయకులు, విద్యావంతులు, మహిళలు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

## మిరప పంటకు ముడత తెగులు



మిరప పంటకు సోకిన ఆకుముడత తెగులు

కొల్లాపూర్, సెప్టెంబర్ 30 : ప్రస్తుతం మిరపంటకు జెమిని వైరస్ (ఆకుముడత తెగులు) సోకినట్లు డివిజన్ ఉద్యానశాఖ అధికారి లక్ష్మణ్ తెలిపారు. నివారణకు వ్యాధి సోకిన మొక్కలను నాశనం చేయాలన్నారు. పొలంలో కలుపు మొక్కలను నివారించి పసుపు రంగు, జిగురు అట్టలను ఎకరాకు 8–10చొప్పున అమర్చాలన్నారు. నివారణకు పైరిప్రాక్సిపెన్ 1.5 మి.లీ. లేదా పైరిప్రాక్సిపెన్+ఫెన్ ప్రొప్రాతిన్ 1మి.లీ. మందును లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. లేదా అజాడిరక్టిన్ (1500 పీపీఎం) 5మి.లీ. +ఎసిటమిప్రిడ్0.3గ్రా/లీ. నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు.

## చెరువుగట్టుపై ముళ్ల పొదలు తొలగింపు

కొల్లాపూర్, సెప్టెంబర్ 30 : స్వచ్ఛతాహీ సేవాలో భాగంగా పట్టణంలోని శివాలయం ఎదుట ఉన్న తిప్పరాజులకుంట చెరువుగట్టు రోడ్డుపై ఉన్న ముళ్లపొదలను మున్సిపల్ కమిషనర్ రాజయ్య ఆధ్వర్యంలో సిబ్బంది శనివారం తొలగించారు. చెరువుగట్టు రోడ్డును సిబ్బంది శుభ్రం చేయగా కమిషనర్ బ్లీచింగ్ పౌడర్ చల్లారు. కార్యక్రమంలో ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ జమీర్ పాషా, జవాన్లు, సిబ్బంది పాల్గొన్నారు.